నిరుద్యోగము

సి. హెచ్. లక్ష్మణరావు గారు, బి. ఎ., బి. ఇ. డీ.

ఈ కాలంలో మనుపటికంటె చదువుకున్నవారు హెచ్చుగానే వున్నారు గాని, ఇదివరకల్లా "'ఓ' అంటే 'న' రాదు, నువ్వు ఏవూ రెల్లి పుకంవేసినా దమ్మిడీఅయినా చిక్కదు"అనేవాళ్లంతా, "నువ్విప్పుడు బి. యే. ప్యాసయితేమాత్రం నీ కెవ్వ డుద్యోగం ఇస్తా డయ్యా" అనేవాళ్లే. నూరుసంవత్సరాల్లో కాలం ఇట్లా మారిపోయింది. పెళ్లికొడుకుల్లో బి. యే. గాని, బి. యల్. గాని, యం. బి. గాని చదువుతూన్నా డంటే గొప్ప హెచ్చు, కట్నం హెచ్చు; ఎంచే తంటే, ఏమో ప్యాసయినతర్వాత ఎంవూడ పొడిచేస్తాడో అని. అంతేగాని, బి. ఏ., ప్యాసయ్యేడని గాని, బి. యల్. పట్టా పుచ్చుకున్నా డనిగాని, యం. బి. అయిందనిగాని వింటే గొప్పేం లేదు. ఎంచేతా ? ప్యాసయితే ఇప్పు డేం చేస్తున్నా డనే ప్రశ్న వస్తుంది. ఇంటిదగ్గర కూర్చుని తింటున్నాడా? లేక దుకాణం పెట్టేడా? అని అడుగుతారు.

ఐతే మనస్థితి ఇట్లా మారటానికి కారణా లేమిటో కొంచెం వెతకాలి. మొదట్లో యీఇంగ్లీషువిద్య నేర్చుకొన్నవాళ్లు కొంచెమందే వుండేవాళ్లు. అంచేత వాళ్లకు వెంటవెంటనే, నెత్తిమీద పెట్టుకొని వుద్యోగా లిచ్చేవాళ్లు అన్నిశాఖల్లోనూ. రానురాను, ప్రతీతండ్రికి తన కొడుకు గొప్పజీతగా డవాల్ని వుంటుంది గాబట్టి, కొడుకులికి ఆవిద్య నేర్పిస్తూవచ్చేరు. చిరస్నేహితులయిన ఇద్దరు చాలాకాలం విడిపోయి తిరిగీ కలుసుకున్నప్పుడు "ఓహో !" అంటే "ఓహో!!" అనుకోంగానే, "మీవాళ్లంతా క్షేమంఆఁ? అప్పుడూ, మీకు ఇద్దరు మొగపిల్లలు, ఒక ఆడపిల్ల గదూ?—అయితే పెద్ద వా డేం చదువుతూన్నా డేమిటి ?" అని అడగడం; "అబ్బే! ఏదో ఇంటర్మీడియటు చదువుతున్నాడు, రెండోవాడు చిన్నవాడూ, ఏదీ ఇంకా ఫోర్తుఫారంలో వున్నాడు—"

"మరేం. ఇంక రెండేళ్లలో మీరు కాళ్లు ముడుచుకూచుంటే మీవాడు గడించి పోస్తూంటాడు. మీరు మంచి అదృష్టవంతులండి. అయితే పిల్లకి పెళ్లీడొచ్చింది గాబోసు, పెళ్లి చేసేరా?"

"ఆఁ, చేసేనండి, మొన్ననే మాఘమాసంలో. బందరులో బి. యే. చదువుతూన్నాడండి."

"ఇంకేం. మీ రెల్లాగైనా గడుసువాళ్లండీ—"

ఇట్లా మాట్లాడుకోవటం అలవాటై యున్నాది. చదు వుంటే ఇంకేం అక్కరలేదు. బి. ఏ. ప్యాసయితే వా డింక గొప్పవాళ్లల్లో జమే. ఇల్లాంటిరోజులు మొన్నమొన్నటిదాకాకూడా వుండేవి. అల్లాంటిమనుష్యులు ఇప్పుడుకూడా లేకపోలేదు.

ఈవిధంగా ప్రతీతండ్రీ తనపిల్లవాణ్ణి ౫ ఏళ్లు రాంగానే బడిలో వెయ్యడం, మెల్లిమెల్లిగా రెండేళ్లు ఎలిమెంటరీస్కూలులో అయినతక్షణం, కొంప మునిగిపోయినట్లు, తెలుగంటే ఏవిటో తెలియకుండా వున్న కుర్రవాడ్ని, ఆసర్టిఫికేటు చింపేసి, ప్రైవేటుస్టడీ అని చెప్పి ఏ హైస్కూలులో కో తీసుకువెళ్లి ఫిఫ్తుక్లాసులో నో, లేక ఫస్టుఫారంలో నో ఏదోవిధంగా (అనేకమార్గాలున్నాయి లెండి) జేర్పిస్తారు. ఇదంతా ఎందుకు ? వా డేమిటో బి. యే. ప్యాసయితే తన్నుద్ధరిస్తాడని. అప్పు సొప్పు చేసి, ఆవూళ్లో కాలేజి లేకపోతే ఏ గుంటూరో, బందరో, లేక మద్రాసో పంపించడం అలవాటయిపోయింది. ఊళ్లోనేగదా కాలేజి వుంది, బి. ఏ. అవనీండీ, తర్వాత చూసుకుందాం అనే వాళ్లు కొంతమంది; బి. యే. ప్యాసయితే వుద్యోగమే దొరకదా ? అనేవాళ్లు కొంతమంది. ఈవిధంగా ఓవుద్యోగం అని అనుకోకుండా, అందరూ ఏదో ఒకటి దొరుకుతుందని, పిల్లవాండ్రకు బి. యే. దాకా చదువులు చెప్పిస్తూవచ్చేరు. ప్రతివాడు "నాకొడుక్కి బి. యే. ప్యాసయితే వుద్యోగం దొరకదా" అనుకుంటూ "నేనొక్కడినే గాదా, నీళ్లు పోస్తే ఏమవుతుంది" అని అను

కుంటూ పొలకు బదులు నీళ్లే పోసిన కోమట్లలాగ, చివరకి అందరిపిల్లలనూ అందరూ బి. యే. వరకు చదువు చెప్పిస్తూవచ్చేరు.

ఇది గాక గవర్నమెంటువారుగూడ హైస్కూళ్లకై తేనేమి, కాలేజీలకై తేనేమి, గ్రాంటులు ఇస్తూవుండడమువలన, ప్రతిపల్లెటూళ్లోను ఒకహైస్కూలు, ప్రతి జిల్లాకు షుమారు ఒకకాలేజి (కొన్నిట్లో రెండు, మూడు కూడా వున్నాయి) లేచేయి. హైస్కూలుచదువు కాగానే కొంచెం పెట్టుబడి పెట్టగలిగివుండే ప్రతీవాడూ కాలేజీలో జాయినవడమే పద్ధతయిపోయింది. యీవిధంగా ప్రతీకాలేజినుండి సంవత్సరానికొకమారు 30 మందికి తక్కువ లేకుండా బి. యే. లు తయారౌతున్నారు. పాపం, కొన్నేళ్లు గడచినతరువాత గవర్నమెంటువారనండి, లేక యూనివర్సిటీవారనండి, ఎవరో ఒకరు, ఒకసారి తప్పినవాళ్లమీద దయ తలచి, తిరిగి ఒకసంవత్సరం చదువనక్కరలేకుండా ఇంటిదగ్గర కూర్చునే చదువుకొని పరీక్షలకు వెళ్లవచ్చునని సెప్టెంబరుపరీక్షలంటూ కల్పించేరు. యీ రెండోరేవులో వాళ్లనికూడా కలిపితే మొత్తంమీద సంవత్సరానికి కనీసం ౧౦౦ మందైనా తయారౌతూ వచ్చేరు. స్కూళ్లు కాలేజీలతోపాటు యూనివర్సిటీలు కూడా హెచ్చయినాయి. ౨ సంవత్సరాల్లో మదరాసురాజధానిలో రెండు కొత్త యూనివర్సిటీలు లేచేయి. ఆంధ్రయూనివర్సిటీలో ౧౦౦ మంది బి. యే. లు తయారైతే, మద్రాసు యూనివర్సిటీలో ౧౫౦ మంది తయారు, అన్నామలైలో ఓ ౨౫ మంది. ఎంత తగ్గిద్దామన్నా మొత్తాన్ని ఓ ౨౦౦ మంది అవుతారనడానికి సందేహం లేదుగదా?

అయితే సంవత్సరానికి తయారైయే యీరెండు వందలమంది బి. యే. లకి వుద్యోగాలు కావాలంటే, ఆకాశంమీంచి కురుస్తాయా, లేక చెట్లనుండి పండుతాయా? లాయరవుదామంటే వీథివీథికి పదేసి బోర్డులు. దేశక్షేమంకోసం, ఎంత జట్టీలు, కూనీలు (ఒక వేపు హెచ్చు అవాలని కోరుతూ) మాన్పినా, ఇంతమంది ఎందుకూ? డాక్టర్లతోపాటు రోగాలుకూడా హెచ్చవుతున్నాయి. చదువుక్రింద తగలేశిన రు ౫,౦౦౦ లు కాకుండా ఇంకోరెండువేలు పోస్తేనే గాని దుకాణం పెట్టడం కుదరదు. పెట్టినా వడ్డీడబ్బులేనా కిట్టవు. పాపం ఒకటిమాత్రం నిజం. స్కూళ్లు, కాలేజీలు, సంవత్సరానికి రెండేసిపరీక్షలు, ఇట్లా ఇవన్నీ హెచ్చవడంవల్లమాత్రం కొంచెం మేష్టరీవుద్యోగాలు దొరుకుతూ వచ్చేయి. అయితే దాన్లో ఒకకష్టం వుంది. ట్రయినింగవుతేనే గాని మేష్టరుపని ఇవ్వరు. మేష్టరుగా కొన్నాళ్లయినా పనిచేస్తేనే గాని ట్రయినింగు కాలేజీలోకి రానివ్వరు. యీవిధంగా బి. యే. లు హెచ్చయిపోవటం జూచి మేనేజర్లు కూడా రేటు రు ౫౦ కి, కొన్ని స్కూళ్లల్లో రు 3౫కి కూడా తగ్గించేసేరు.

అందుచేత స్కూలుఫైనలు ప్యాసయినవాళ్లు దరఖాస్తు చేసే వుద్యోగాలకికూడా బి. యే. లు అప్లయి చేయడము మొదలుపెట్టేరు. తాలూకాబోర్డు ఆఫీసులో గుమాస్తాగిరీకి, మ్యూనిసిపాలిటీలో గుమాస్తా గిరీకి, రిజస్ట్రారుఆఫీసులో గుమాస్తాగిరీకి, ఒకటేమిటి ఆఖరుకి ప్రైవేటుసంస్థానాల్లో గుమాస్తాలపన్లకి కూడా అప్లయి చేయడం మొదలుపెట్టేరు. ఒక స్కూలుఫైనలు కాండిడేటు అప్లికేషనుతోపాటు బి. యే. దికూడా ఒకేపనికి వస్తే, ఎవళ్లకి ఇవ్వాలనుంటుంది మీకే చెప్పండి. ఈ విధంగా యీ బి. ఏ. లు పాపం, స్కూలుఫైనలుకంటె హెచ్చు చదవలేని వాళ్లనోట్లో మన్నుకొట్టి వాళ్లకూడా వుద్యోగాలు లేకుండా చేసేరు. కాబట్టి వాళ్లో కొందరు యీనిరుద్యోగపు డిపార్టుమెంటులో జేరేరు. సరే, ఇక నయింది. ఇప్పుడు ఆ ఆఫీసులుకూడా బి. ఏ. లతో నిండిపోయేయి. ఒకసంవత్సరంలో తయారయిన ౨౦౦ మందికే వుద్యోగాలు దొరకక అఘోరిస్తూవుంటే ఇదేం చూసుకోకుండా ఫ్యాక్టరీల్లో వేరుశెనగ కాయల బస్తాల్లాగ ఊరికే సంవత్సరం సంవత్సరం బి. యే. లని తయారుచేసి పారేస్తున్నాయి, యీ యూనివర్సిటీలు. డిమాండు తక్కువ, ప్రొడక్షను ఎక్కువ. అందువల్ల ఫలితం అందరికి తెలిసిన విషయమే—వస్తువ చవకైపోవడము. స్టాకు అట్టే మిగిలిపోతూంటే, ఎందుకూ యీ ఫ్యాక్టరీలు ఊరికే ఆడటం? లాంకషైరులో బట్టలు తయారుచేసే మిల్లులు ఏం జేసేరు ఇప్పుడు, విదేశబట్ట

చెల్లుబడి ఇండియాలో తక్కువయి పోయినప్పుడు? అట్లాగే యీ యూనివర్సిటీలు కూడా కొన్ని సంవత్స రాలు మూసివేయకూడదా ?

అయితే ఇంతమందికి వుద్యోగాలు దొరకక పోవ డమునకు కారణం వెతకవలసివుంది. దేనిలో వుం దీలోపం? అంటే బాగా ఆలోచిస్తే ప్రస్తుతపు విద్యా విధానంలో వున్నట్లు కనిపిస్తుంది. మన స్కూళ్లలోను, కాలేజీలలోను నేర్పేవిద్య ఉద్యోగాలకి పనికివచ్చే విద్య గాదు. మనోవృద్ధిని, జ్ఞానవృద్ధిని కలుగ జేస్తుంది. అంతే కాకపోతే $a^2-b^2=(a+b)(a-b)$, $Cos^2A+Sin^2A=1$, మళ్లీ మేష్టరుగా కుర్రవాళ్లకి నూరిపోయ డానికి తప్ప మరెందుకూ పనికిరావు. పూర్వకాలం బి. ఏ. లు చాలా తక్కువగా వుండడము వలన అన్నీ పెద్దపెద్దవుద్యోగాలు దొరుకుతూ వుండేవి. కొంతమంది తహశ్శీల్దారులుగాను, బి. యల్. కూడా ప్యాసయినవాళ్లు జడ్జీలగాను, కుదురుకున్నారు. అప్పటికాలంలో బి. ఏ. ప్యాసయి వుండాలని రూలు లేదు గాని, ప్యాసయినట్ల యితే వెంటనే వుద్యోగాలు వచ్చేవి. ఇప్పుడో, యీ బి. ఏ. లు ఎచ్చయిపోవడం వలన, ఇదంతా కనిపెట్టి కార్పొరేషను గుమాస్తాగా వుండాలన్నా సరే, కనీసం బి. యే. ప్యాసవాలన్న నిబంధనే. ఏ వూరు పేరు లేని ఆఫీసులో పనిచేద్దామన్నా బి. ఏ. ప్యాసయివుండాలి. అచ్చాఫీసులో వుద్యోగం కావలసివున్నా బి. యే. ప్యాసయివుంటే మంచిది. ఇన్సూరెన్సుకంపెనీ ఏజంటుగా పనిచెయ్యాలనుంటే, బి. యే. క్వాలిఫికేషను కావాలి. దీనికి దానికి అని లేదు. ఫిజికలు డైరక్టర్లు, డ్రాయింగు మాష్టర్లు, మాన్యూఅలు ట్రెయినింగుమాష్టర్లు, రైల్వేమా ష్టర్లు—అంతా బి. యే. ప్యాసయివుంటే త్వరగా రు. 35 వుద్యోగం దొరుకుతుంది. వీళ్లంతా బి. యే. ప్యాసయి వుంటే, స్కూలుఫైనలు ప్యాసయినవాడి కంటె ఏమి గొప్పో తెలియదు. మాటవరసకి ఒకటి తీసుకుందాం. ఫిజికలు డైరక్టరు వుద్యోగం చేసేవాడు బి. ఏ. ప్యాస యితే డ్రిల్లుచెయ్యడానికి ఎందుకేనా వుపయోగిస్తుందా చెప్పండి. సర్కసులో బారుమీద మొగ్గలు వేసేవాడు బి. ఏ. పాసయితే బాగా మొగ్గలు వేస్తాడంటారా ? (పాపం వాళ్లధర్మమా అని వాళ్లుకూడా వాళ్లయాక్టర్లని బి.ఏ.ప్యాసవాలనికోర లేదు.) బి. యే. లో చదివిన ఆషేక్స్పి యరు, షెల్లి, డ్రైడను, మిల్టను, యీవుద్యోగాల్లో పనికొస్తా యా? ఆ రేఖాగణితం, ఆ కేల్కుల్యలేషన్లు; ఆ హీటు, లైటు, ఎలెక్ట్రిసిటీ, మేగ్నిటిజము పనికొస్తాయా ? ఆ ఓజోను, హైడ్రోజనుపెరాక్సయిడు, అటామిక్కు థియరీ పనికొస్తాయా ? ఆసైకాలజీ, లాజిక్కు పనికొస్తాయా ? ఏదీ పనికిరాదు. ఇంటర్మీడియటు ప్యాసయితే బి. ఏ. కి పనికొస్తుంది. బి. యే. ప్యాసయితే, యం. యే. కి పని కొస్తుంది. యమ్. ఏ. ప్యాసయితే ఎందుకూ పనికిరాదు. అంతే దాని కర్థం. 'సిటిజను' అనుపించుకోవడానికి తగిన క్వాలిఫికేషన్లు యీ బి. ఏ. ప్యాసయినవాళ్ల కేమ యినా వున్నాయేమో పోనీ చూదాం. బి. యే. ప్యాస యినవాడి కెంత కాన్స్టిట్యూషనలు హిష్టరీ (వివిధదేశ పరిపాలనావిధానము) తెలుసునో, స్కూలుఫైనలువాడికి అంతే తెలుసును. తనదేశముయొక్కనైతేనేమి ఇతర దేశ ములయొక్కనైతేనేమి ఔన్నత్యమును తెలుసుకొనుటకు ఇద్దరు ఒకేపుస్తకములను తిరిగి పఠించవలెను. బి. యే. ప్యాసయినాను, ఏవుద్యోగమునకైనను కనీసము యిది ప్యాసయివుండవలెను, నాదేశస్థితి యిట్లున్నది, నేనిట్టి స్థితియందున్నాను, దేశముపట్ల నావిధి ఇద్ది అని మను కొంద మన్న ఏమున్నది? వీనియందు ఏభాగమందు చూచినను ఆవిద్య సున్న. అయితే మరి బి.యే. వరకు నేర్చినవిద్యవలన ప్రయోజన మేమీ? ఉద్యోగములకా పనికిరాదు. దేశముసంగతు లెరుంగుటకా పనికిరాదు. ఈవిధముగా ప్రస్తుతపువిద్యావిధాన మున్నది.

కాబట్టి ప్రస్తుతపు విద్యావిధానము నామూలాగ్ర ముగా మార్చిననే గాని మన కీనిరుద్యోగమునుండి విముక్తి గానరాదు. ఈవిద్యను మార్చి ప్రతిజిల్లాలోను పారి శ్రామికవిద్యాలయములను నెలకొల్పి పారిశ్రామికవిద్య (Industrial Education)లను నేర్పుచు, వానికి తోడు మేధావృద్ధికొఱకు ఇతరభాషలను, ఇతరశాస్త్రములను ఆప్షనలుగా నేర్పుచు, దేశచరిత్ర, భూగోళము, స్వదేశ

పరిపాలనావిధానము ప్రతివిద్యార్థికి తప్పక నేర్పుచు, ఆపారిశ్రామికతరగతులలోనే పెద్దపెద్దతరగతులను నియమించిన, ఏపరిశ్రమయం దిష్టము గలవా డాపరిశ్రమను జదివి, దానియందలి పెద్దతరగతియం దుత్తీర్ణుడై, దానియందే యుద్యోగమును పొందగలడు. ఏవుద్యోగమునం దున్నను దేశస్థితిని దెలిసినవా డగును; కొంచెమో గొప్పో దేశాభిమానియు గావచ్చును. అట్టివానినే నిజమైన సిటిజను అనవలయును. ఈరీతిగా పారిశ్రామికవిద్యలను నేర్పుచు, దేశీయుల కుద్యోగముల నిప్పించుదేశము లిప్పుడు లేకపోలేదు. అట్టివాటిలో అమెరికాను, జర్మనీని పేర్కొనవలసియున్నది. కాబట్టి ప్రస్తుతపు విద్యావిధానమును మార్చునంతవరకు, యీనిరుద్యోగసమస్య మనలను బాధించుచునే యుండును.

నాళీకము

దొండపాటి రామమూర్తి గారు

ఇనుఁ డాత్మేశ్వరుఁ డందరా కరుగుఁ దా నెల్లప్పుడం చెంచియో?
నిను లెక్కింపక సొక్కుచుండు ననియో? నీచగ్రహావాప్తిమై
ననయం బ్రియుఁ డక్షియుగ్మమున కుగ్రాలోకనుం డౌట నం
చునో? యేలా గొన నీ ద్వజానుసరణౌత్సుక్యంబు నాళీకమా!

కవి నా నొప్పుచు నప్పులం బడి భవత్కారుణ్య మార్జించి నీ
దవు సర్వస్వముఁ జూఱలాడు విషవిఖ్యాతప్రభావోదయుఁ
ధవనామప్రతిహస్తవారణములం దప్పించెదే భర్తృ పా
దవిఘాతమ్ములనుండి యాశ్రితపరార్థం బొప్పు, నాళీకమా?